జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
గురువారం 28 మే 2026
పేజీలు : 8




## ఎమ్మెల్యే పాయల్ శంకర్‌వి శిఖండి రాజకీయాలు



# బాదుడే బాదుడు... వీరబాదుడు..!






పెరుగుతున్న పెట్రోల్ ధరలతో బెంబేలెత్తుతున్న వాహనదారులు

చిన్న వాహనాలను వదిలి సైకిల్ వైపు మళ్లుతున్న సామాన్య ప్రజలు

వారం లోనే నాలుగు దఫాలుగా మంచిర్యాలలో పెరిగిన పెట్రోల్ భారం రూ.8.23

## చెన్నూరు పల్లెవెలుగు బస్సు పునఃప్రారంభానికి వినతి



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన మంచిర్యాల--చెన్నూరు ఆర్డినరీ (పల్లెవెలుగు) బస్ సర్వీసును తిరిగి ప్రారంభించాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ చెన్నూర్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ ఇలియాజుద్దీన్ రాష్ట్ర మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రి యపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



# టేకుమట్ల కొనుగోలు కేంద్రంను సందర్శించిన మంత్రి వివేక్

బాల్క సుమన్ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు

**జైపూర్, మే 27:**ప్రజా జ్యోతి జైపూర్ మండలంలోని టేకుమట్ల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం సందర్శించారు.కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు.ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.ఈసారి పంట దిగుబడి అధికంగా వచ్చిందని గత సీజన్‌లో లక్షా పది వేల టన్నుల కొనుగోళ్లు జరగగా ఈసారి లక్షా డెబ్బై వేల టన్నుల వరకు కొనుగోలు చేసే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంద న్నారు.జూన్ 6 వరకు కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.హమాలీల కొరత, లారీలు అందుబాటులో లేకపోవడం వల్ల కొంత ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. పెద్దపల్లిలో మూడు గోదాములను సిద్ధంగా ఉంచామని, అదనపు లారీలు కోసం సింగరేణి సంస్థ సహకారం కోరామని తెలిపారు.ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు కావాలనే ధర్నాలు నిర్వహిస్తున్నారని మంత్రి ఆరోపించారు.రైతులకు భరోసా



కల్పించాల్సిన సమయంలో కార్యకర్తలను రెచ్చగొట్టి ఆందోళనలు చేపడుతున్నారని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందలాది లారీలు నిలిచిపోయేవని ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.గత ఎన్నికల్లో వంద కోట్లు ఖర్చు చేశానని బాల్క సుమన్ చెప్పాడని ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.సింగరేణికి లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పిందని బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు.

# సింగరేణి ఆస్తుల విధ్వంసానికి ప్రేరేపించిన

## బాల్క సుమన్‌పై సుమోటో కేసు నమోదు చేయాలి

### ఐఎన్టీయూసీ నాయకులు





**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):**సింగరేణి సంస్థ ఆస్తులు, రైల్వే పట్టాల విధ్వంసానికి ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై ప్రభుత్వం సుమోటో కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని ఐఎన్టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ఐఎన్టీయూసీ యూనియన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణి సంస్థ మిగులు బడ్జెట్ సుమారు రూ.11,500 కోట్లను దుర్వినియోగం చేసి, సంస్థపై రూ.39 వేల కోట్ల బకాయిల భారం మోపారని ఆరోపించారు. అలాంటి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బాల్క సుమన్ ఇప్పుడు హింసాత్మక చర్యలకు ప్రేరేపించే వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిప డ్డారు. బీఆర్ఎస్ చేపట్టే నిరసన కార్యక్రమాలకు ప్రజలు, రైతులు సహకరించడం లేదనే అసహనంతో పార్టీ క్యాడర్‌ను రెచ్చగొట్టే విధంగా బాల్క సుమన్ మాట్లాడారని విమర్శించారు. సింగరేణి మందమర్రి జీఎం కార్యాలయం, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌పై దాడులు చేసి తగులబెట్టాలని, రైల్వే పట్టాలను ధ్వంసం చేస్తూ రైల్ రోకో చేపట్టాలని, మిలిటెంట్ తరహా కార్యాచరణకు సిద్ధంగా ఉండాలని పిలుపునివ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నా రు. సింగరేణి కార్మికులు, ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధి ఇలాంటి విధ్వంసకర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఓపెన్ కాస్ట్ గనులను రద్దు చేసి అండర్‌గ్రౌండ్ గనులు ఏర్పాటు చేస్తామని, కాంట్రాక్టీకరణ రద్దు చేసి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి చివరకు కార్మికులను, ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. గతంలో బాల్క సుమన్ పిలుపుతో శ్రీరాంపూర్ ఏరియాలో గుర్తింపు సంఘం నాయకులు యాజమా న్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించగా, వారిపై క్రమశిక్షణ చర్యల పేరుతో ఇతర ఏరియాలకు బదిలీలు జరిగాయని గుర్తు చేశారు. ఆ సమయంలో వారికి ఎలాంటి సహాయం చేయలేని పరిస్థితి ఏర్పడిందని, బదిలీ అయిన కార్మికులు ఇప్పటికీ ఇబ్బందు లు పడుతున్నారని తెలిపారు. పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసిన సమయంలో సాధారణ జీవితం గడిపిన బాల్క సుమన్, ఇప్పుడు వందల కోట్ల ఆస్తులకు అధిపతిగా మారి అహంకారంతో సిం గరేణి, రైల్వే ఆస్తులను తగులబెట్టాలని పిలుపునివ్వడం దురదృష్టక రమని విమర్శించారు. బాల్క సుమన్ వ్యాఖ్యలకు సంబంధించిన పత్రికా కథనాలు, మీడియా రికార్డులను ప్రభుత్వం సుమోటోగా స్వీకరించి ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐఎన్టీ యూసీ యూనియన్ గా డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఐఎన్టీ యూసీ కేంద్ర నాయకులు సిహెచ్ భీమ్‌రావు, కలవేని శ్యామ్, గరిగస్వామి, పి. తిరుపతి రాజు, పేరం రమేష్, జీవన్ జోయల్, ఏనుగు రవీందర్ రెడ్డి, సిహెచ్ అశోక్, లేగల శ్రీనివాస్, ఐరెడ్డి తిరుపతిరెడ్డి, పిన్నింటి మల్లారెడ్డి, రెక్కల గోపాల్ రెడ్డి, పి. వెంక టేశ్వర్లు, జీవన్ రావు, కారుకూరి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు బీసీ వాదం.. బీసీల ఐక్యతే రాజ్యాధికారానికి పునాది

బీసీ మహిళ రాష్ట్ర కన్వీనర్, న్యాయవాది పేరం అలేఖ్య



**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):** బీసీ సమాజం ఐక్యంగా ముందుకు వచ్చి రాజ్యాధికార సాధన దిశగా అడుగులు వేయాలని బీసీ మహిళ రాష్ట్ర కన్వీనర్, న్యాయవాది పేరం అలేఖ్య బుధవారం పిలుపునిచ్చారు. గత 78 సంవత్సరాలుగా ఏ రాజకీయ పార్టీ కూడా బీసీల అస్తిత్వం, గౌరవం, జనాభా లెక్కలను సరైన విధంగా ప్రాధాన్యం ఇవ్వలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో బీసీలకు తగిన స్థానం కల్పించలేదని, మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. బీసీలను కులాలు, మతాలు, పార్టీల వారీగా విభజించి రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయని ఆరోపించారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, న్యాయ హక్కులను కోల్పోతున్న బీసీ సమాజం ఇక మేల్కొనాల్సిన సమయం వచ్చిందన్నారు. కుటుంబ పాలనలతో రాజకీయ నాయకులు ముందుకు సాగుతుంటే బీసీ యువత నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, కులవృత్తుల కోల్పోవడం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. రాజ్యాంగంలోని 14వ అధికరణ సమానత్వాన్ని సూచిస్తున్నప్పటికీ బీసీ సమాజానికి మాత్రం అసమానతలే ఎదురవుతున్నాయని విమర్శించారు. బీసీ పెద్దలు, నాయకులు, యువత గడపగడపకు వెళ్లి చైతన్యం కల్పించాలని, హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ పాపన్న గౌడ్, చాకలి ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలతో బీసీ సమాజం చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన బీసీ సమాజం ఇప్పుడు బీసీ రాజ్యాధికార సాధన కోసం కూడా ముందుకు రావాలని అన్నారు. "రావాలి రావాలి బీసీల రాజ్యం రావాలి.. పోవాలి పోవాలి అసమానతలు పోవాలి.. బీసీ మేలుకో రాజ్యమేలుకో" అంటూ నినాదాలు చేశారు. ఈ సమావేశంలో కోదూరు చంద్రయ్య, గుమ్ముల శ్రీనివాస్, వడ్డేపల్లి మనోహర్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## "పొగాకు బారిన యువత.. ఆరోగ్య భవిష్యత్తుకు ముప్పు"



**మంచిర్యాలరూరల్ మే27(ప్రజాజ్యోతి)** మంచిర్యాల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో "ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవం 2026" సందర్భంగా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఎస్ అనిత పోస్టర్లు,కరపత్రాలు, బ్యానర్లను విడుదల చేశారు."యువతను పొగాకు ప్రభావం నుండి రక్షించండి" అనే థీమ్‌తో ఈనెల 25 నుండి 31 వరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు,బస్టాండ్లు ప్రజా ప్రదేశాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్,గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని ప్రజలకు వివరించారు. పొగాకు రహిత సమాజం ఆరోగ్యకరమైన భవిష్యత్తు లక్ష్యంగా ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు,పోస్టర్ ప్రదర్శనలు,ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత పొగాకు, నికోటిన్ ఉత్పత్తులకు దూరంగా ఉండాలని పొరుగు వారిని సైతం ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు,సిబ్బంది జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సహారా ఇండియాలో కట్టిన డిపాజిట్లు వెంటనే చెల్లించాలి

**లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని సహారా బాధితుల ఆందోళన**



**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):** సహారా ఇండియాలో తాము కట్టిన ఫిక్స్ డిపాజిట్లకు గడువు ముగిసి నాలుగు నుంచి ఐదు సంవత్సరాలు దాటిపోయినా ఇప్పటికీ డబ్బులు చెల్లించకపోవడం పట్ల సహారా బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సమావేశమైన సహారా బాధితులు, తమ డిపాజిట్లను వెంటనే చెల్లించాలని బుధవారం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యమవుతాయని, తమ ఆత్మహత్యలకు పూర్తి బాధ్యత సహారా ఇండియా యాజమాన్యానిదేనని హెచ్చరించారు. వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది సహారా బాధితులు ఉన్నారని, వారికి సహారా యాజమాన్యం రూ.1,40,000 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని తెలిపారు. అయితే ఇప్పటివరకు కేవలం రూ.5,000 కోట్ల మేర మాత్రమే డిపాజిట్లు చెల్లించారని ఆరోపించారు. ఇంకా మెచ్యూరిటీ పూర్తైన పాలసీదారులందరికీ వారి డబ్బులు వెంటనే చెల్లించేలా కేంద్రంలోని బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఢిల్లీ లోని సెబీ సంస్థతో సంప్రదించి సహారా డిపాజిట్ దారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పందించి సహారా బాధితుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్యతో పాటు సహారా బాధితులు పులి కృష్ణ, మురహరి, రమేష్, గంగయ్య, రాజన్న, చారి తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసు ఛేదింపు

## భార్యాభర్తల అరెస్ట్



**రామకృష్ణాపూర్, మే 27(ప్రజా జ్యోతి):** రామకృష్ణాపూర్‌లో వృద్ధురాలి మెడలో నుంచి బంగారు పుస్తెల తాడు దొంగిలించిన కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. శ్రీనివాస్ నగర్‌కు చెందిన నల్లాల రాయమల్లక్క ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారు తాడును అపహరించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టగా, దొంగిలించిన బంగారాన్ని అమ్మేందుకు వెళు న్న గజ్జి శ్యామ్, రమ అనే భార్యాభర్తలను సింగరేణి ఏరియా హాస్పిటల్ ఆటోస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు త్రాడును స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు అలవాటు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిందితులు దొంగతనానికి పాల్పడ్డారని మందమర్రి సీఐ పర్శ రమేష్ తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ జే. శ్రీధర్, పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

# బాదు డే బాదుడు... వీరబాదుడు..!

**పెరుగుతున్న పెట్రోల్ ధరలతో బెంబేలెత్తుతున్న వాహనదారులు**

**చిన్న వాహనాలను వదిలి సైకిల్ వైపు మళ్లుతున్న సామాన్య ప్రజలు**

**వారం లోనే నాలుగు దఫాలుగా మంచిర్యాలలో పెరిగిన పెట్రోల్ భారం రూ.8.23**






**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండగా, మరోవైపు ఇంధన ధరల పెరుగుదల ప్రజలపై అదనపు భారం మోపుతోంది. ముఖ్యంగా మంచిర్యాల జిల్లాలో గత కొద్ది రోజులుగా వరుసగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. “బాదు డే బాదుడు... వీరబాదుడు” అంటూ ప్రజలు,వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ ధరలు పెరగడంతో చిన్న ఉద్యోగులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజువారీగా బైక్‌లపై ఉద్యోగాలకు వెళ్లే ఉద్యోగులు ఇప్పుడు వాహన వినియోగాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. కొంతమంది చిన్న దూరాలకు ద్విచక్ర వాహనాలను పక్కన పెట్టి సైకిళ్లను ఉపయోగించడం ప్రారంభించారు. విద్యార్థులు, డెలివరీ బాయ్స్, చిన్న వ్యాపారులు కూడా పెరిగిన ఇంధన ధరలతో ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాల పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో 14 వరకు 108.50 ఉండగా, 15 నుంచి 111.89కు చేరింది. అంటే ఒక్క లీటర్‌పై రూ.3.39 పెరిగింది 19న రూ.112.86 కు పెరిగింది. అనంతరం 23న రూ.113.83కు చేరి, 25వ తేదీ నాటికి ఏకంగా రూ.116.71కు పెరగడం వాహనదారులను కలవరపెడుతోంది. ఇక పవర్ పెట్రోల్ ధరలు కూడా సామాన్యులకు అందనంత స్థాయికి చేరుతున్నాయి. ఈ నెల 15న రూ.118.80గా ఉన్న పవర్ పెట్రోల్ ధర 122.19 కి పెరిగింది. ఇక 19న రూ.123.18కు, 23న రూ.124.15కు పెరిగి, 25వ తేదీ నాటికి ఏకంగా రూ.127.03కు చేరింది. దీంతో అధిక మైలేజ్ కోసం పవర్ పెట్రోల్ వినియోగించే వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో వాహనాల నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీజిల్ ధరలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఈ నెల 15న లీటర్ డీజిల్ ధర రూ.96.65 ఉండగా 99.91 కి పెరిగింది . 19న రూ.100.90కు పెరిగింది. 23న రూ.101.81కు చేరి, 25వ తేదీ నాటికి రూ.104.71కు పెరగడంతో రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడుతోంది. లారీలు, ఆటోలు, సరుకు రవాణా వాహనాల యజమానులు పెరిగిన డీజిల్ ధరలతో ఆందోళన చెందుతున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులపైనే కాకుండా సామాన్య ప్రజల జీవన వ్యయంపైనా పడుతోంది. కూరగాయలు, నిత్యావసర సరుకులు, పాలు, రవాణా చార్జీలు, నిర్మాణ సామగ్రి ధరలు కూడా పెరుగుతున్నాయి. దీంతో ప్రతి కుటుంబ బడ్జెట్ గందరగోళంగా మారుతోంది. విజయవాడలో జరిగిన రాజకీయ సమావేశాలు, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచుతుందని ముందుగానే ప్రచారం జరిగినప్పటికీ బీజేపీ నాయకులు వాటిని ఖండిస్తూ వచ్చారని ప్రజలు గుర్తు చేస్తున్నారు. అయితే ఎన్నికల ఫలితాల అనంతరం కేంద్ర ప్రభుత్వం వరుసగా నాలుగు సార్లు ధరలు పెంచడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఇంధన ధరల పెరుగుదలకు అంతర్జాతీయంగా జరుగుతున్న యుద్ధాలు, ముడి చమురు ధరల పెరుగుదల కారణమని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇస్తోంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న వ్యాట్ పన్నులు తగ్గిస్తే ప్రజలకు ఉపశమనం కలుగుతుందని బీజేపీ నాయకులు అంటున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలోని టీఆర్ఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తేనే ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొంత మేర పన్నులు తగ్గించిందని, కేంద్రం కూడా బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఒకే నెలలో నాలుగు దఫాలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు ఊరట కల్పించాలని వాహనదారులు, కార్మికులు, ప్రజాసంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

## రమాబాయి త్యాగం మరువలేనిది

**అంబేద్కర్ ఆశయాలకు అండగా నిలిచారు: దుర్గం ప్రశాంత్**



**ఆసిఫాబాద్ మే 27 ప్రజా జ్యోతి**భారత రాజ్యాంగ నిర్మాత, బోధిసత్వ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ధర్మపత్ని, త్యాగమూర్తి మాతా రమాబాయి అంబేద్కర్ వర్ధంతిని మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత ఆశయాల కోసం మాతా రమాబాయి చేసిన త్యాగం, చూపిన ఓర్పు ఎనలేనివని కొనియాడారు. సెంటర్ కమిటీ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల్లో మహనీయుల జయంతులు, వర్ధంతులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లుంబిని దీక్ష భూమి అధ్యక్షుడు తుకారాం, సెంటర్ కమిటీ ఉపాధ్యక్షుడు చంద్రీ చంద్రయ్య, కోశాధికారి దుర్గం అనిల్, కార్యదర్శులు జాడి సంతోష్, తక్సండే శంకర్, ప్రచార కార్యదర్శి వైరగడే లోహాజి, మాజీ అధ్యక్షుడు జాడి బాపు, సుధాకర్, స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు దుర్గం యశ్వంత్ రావు, దుర్గం తిరుపతి, కార్యవర్గ సభ్యులు దుర్గం పురుషోత్తం, కట్కర్ అజిత్, బౌద్ధ ఉపాసకుడు కొండయ్య, దుర్గం మారుతి, జాడి అశోక్, కట్కర్ భీమ్ రావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# బాల్క సుమన్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

## భాజపా జిల్లా అధ్యక్షులు నగునూరీ వెంకటేశ్వర్ గౌడ్

**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):**మాజీ ఎంపీ, మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ ఇటీవల టీజేబీకేఎస్ కార్యకర్తల సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరీ వెంకటేశ్వర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్‌తో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు తీవ్రవాదం, గుండాయిజం, రౌడీయిజాన్ని ప్రోత్సహించే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం రైల్వే వ్యవస్థను అభివృద్ధి పరుస్తూ వందే భారత్ రైళ్లు, బుల్లెట్ ట్రైన్‌ల ఏర్పాటుకు కృషి చేస్తుంటే, రైల్వే ట్రాక్‌లు మరియు రైల్వే ఆస్తులను ధ్వంసం చేయాలని పిలుపునివ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా అధికారం కోల్పోయిన తర్వాత రైతులు తమ వద్దకు రావడం లేదనే అసహనంతో, తాము చేసే ఉద్యమాల్లో ప్రజలు పాల్గొనడం లేదని కార్యకర్తలను మిలిటెంట్ ఉద్యమాలకు ప్రేరేపించడం అసాంఘిక శక్తులను ప్రోత్సహించడమే అవుతుందని ఆయన అన్నారు. బాల్క సుమన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రతిపక్ష పార్టీలపై దాడులు చేయించిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదని, అదే మనస్తత్వాన్ని



ఇప్పటికీ కొనసాగిస్తూ అధికార పక్షంపై దాడులు చేయాలని కార్యకర్తలను రెచ్చగొట్టడం ద్వారా తెలంగాణ యువతను పక్కదోవ పట్టిస్తున్నారని వెంకటేశ్వర్ గౌడ్ ఆరోపించారు. ఇది సరైన విధానం కాదని, వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాపర్తి వెంకటేశ్వర్, కౌన్సిలర్ గర్రెపల్లి శాంతా వెంకటనర్సయ్య, కోటపల్లి మండల నాయకులు పెద్దింటి పున్నం చంద్, మాజీ ఎంపీపీ సురేఖ రామయ్య, బీజేపీ నాయకులు శంకర్, కడప శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరుకు ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్ మాదిగ ఎంపిక



**జైపూర్ మే 27 ప్రజా జ్యోతి** ఎమ్మార్పీఎస్ చెన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా జలంపల్లి శ్రీనివాస్ మాదిగను నియమించినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర గౌడ్ చార్వక హాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్ మాదిగ, జిల్లా కో-ఇన్‌చార్జి జన్ను దినేష్ మాదిగలు మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఎమ్మార్పీఎస్ కార్యకర్తపై ఉందన్నారు. మాదిగ సమాజంలో విద్యాపై చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని, నిరక్షరాస్యత కారణంగా సమాజం వెనుకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న చిన్న ఆర్థిక సమస్యలతో విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేస్తున్నారని చెడు అలవాట్లకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. చదువే మాదిగ జాతి అభివృద్ధికి ప్రధాన ఆయుధమని యువత విద్యను ఆయుధంగా చేసుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని పిలుపునిచ్చారు. గో టూ విలేజ్ కార్యక్రమం పేరుతో 50 రోజుల పాటు గ్రామాల్లో విద్యా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని నిరక్షరాస్య తల్లిదండ్రులు, విద్యార్థులకు విద్య ప్రాముఖ్యతను వివరించాలని ఎమ్మార్పీఎస్ శ్రేణులకు సూచించారు. జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని గ్రామ స్థాయిలో నూతన కమిటీల ఏర్పాటు ద్వారా సంస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గద్దె దిమ్మెలు నిర్మించి జాతి ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేయాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణను గ్రామ స్థాయికి తీసుకెళ్లి యువతను చైతన్యవంతమైన సమాజంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగరపు మురళీకృష్ణ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు జలంపల్లి శ్రీనివాస్ మాదిగ, మంతెన మల్లేష్ మాదిగ, గద్దల బాను మాదిగ, చుంచు శంకర్ వర్మ మాదిగ, గుడిసెల దశరథం మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు మిట్టపల్లి మల్లయ్య మాదిగ, నక్క అంజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు వేల్పుల సతీష్ మాదిగ, జిలకర శంకర్ మాదిగ, జీడి సారంగం మాదిగ, టౌన్ అధ్యక్షుడు చిప్పకుర్తి మల్లేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం



**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో ఈ నెల 22 న ప్రారంభమైన అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ యువ క్రీడాకారుల ఉత్సాహభరిత పోటీల మధ్య విజయవంతంగా కొనసాగి, 26 న ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 7వ డివిజన్ కార్పొరేటర్ ఏల్పుల రవీందర్ విజేత జట్లకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్గనైజేషన్ టీం ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, టీం ఎ ఎన్ ఆర్ (అరుణక్కనగర్) ద్వితీయ బహుమతిని అందుకుంది. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఏల్పుల రవీందర్ మాట్లాడుతూ, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని అన్నారు. విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న అన్ని జట్ల క్రీడాకారులకు ఆయన అభినందనలు తెలిపారు. స్థానిక యువకులు నిర్వహించిన ఈ టోర్నమెంట్ విజయవంతం కావడంపై నిర్వాహకులను ప్రజలు అభినందించారు. యువ క్రీడాకారులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాంక్షిస్తూ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# చెన్నూర్ రూరల్ పోలీసులు ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆకస్మిక తనిఖీలు



**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చెన్నూర్ రూరల్ పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవాం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. కృష్ణ పర్యవేక్షణలో, చెన్నూర్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హరి, కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్‌తో కలిసి పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వాయిపేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంతో పాటు సంయుక్త దాడులు చేపట్టారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్రమ గుడుంబా తయారీలో వినియోగించే సుమారు 2000 లీటర్ల బెల్లం వాష్‌ను గుర్తించి ధ్వంసం చేశారు. అదనంగా 20 లీటర్ల అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ గుడుంబా తయారీ, రవాణా మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవించి పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రత, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ కోసం ఇటువంటి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు, సంయుక్త తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# " సీపీఆర్ఎంఎస్ కార్డు" సమస్యలపై సింగరేణి యాజమాన్యం పరిష్కరించాలి

**బీఎంఎస్ నాయకులు**

**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):**సింగరేణి కార్మికులు, పెన్షనర్లకు సంబంధించిన "సీపీఆర్ఎంఎస్" కార్డు సమస్యలను సింగరేణి యాజమాన్యం సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని బీఎంఎస్ నాయకులు కోరారు. సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ యూనియన్ నాయకులు కొత్త కాపు లక్ష్మా రెడ్డి(సిఎంపిఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యులు) సింగరేణి పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం రమాకాంత్ , అడ్వైజర్ పులి రాజా రెడ్డి లు బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి డైరెక్టర్ (పీఏడబ్ల్యూ) గౌతం పోట్రు ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణి పెన్షనర్లకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు, హాస్పిటల్స్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా "సీపీఆర్ఎంఎస్" కార్డు విధానంలో ప్రస్తుతం అమలవుతున్న విధానం వల్ల మాజీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఫిక్స్ మోడల్ ఆసుపత్రుల వ్యవహారంలో గత మూడు నెలలుగా అనేక సమస్యలు నెలకొన్నాయని, మెడికల్ బిల్లుల క్లియరెన్స్ ఆలస్యం కావడంతో రోగులు, కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో, ఐసీయూ చికిత్స సమయంలో కూడా సాఫ్ట్‌వేర్ సమస్యల కారణంగా చికిత్సలో



ఆటంకాలు ఏర్పడుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి సీపీఆర్ఎంఎస్ లబ్ధిదారుకు అమలవుతున్న వార్షిక పరిమితి రూ. 25 వేలుగా ఉండడం సరిపోదని, దానిని పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే సీపీఆర్ఎంఎస్ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ. 8 లక్షల నుండి రూ. 15 లక్షలకు పెంచాలని కోరారు. ప్రతి ప్రైవేట్ ఆసుపత్రిలోనూ సీపీఆర్ఎంఎస్ కార్డు ద్వారా చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి కార్మికులు, పెన్షనర్ల సంక్షేమం విషయంలో యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని, అన్ని సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని వారు కోరారు. సింగరేణి డైరెక్టర్ (పీఏడబ్ల్యూ) గౌతం పోట్రు సానుకూలంగా స్పందించారని సమస్యలను పరిష్కరించడానికి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు .

# కార్మిక హక్కుల పరిరక్షణ కోసం , కార్మికుల సంక్షేమం కోసం నాలుగు దశాబ్దాలుగా అహర్నిశలు కృషి చేశారు

**జెట్టి శంకర్రావుకు శ్రమశక్తి అవార్డు గ్రహీత జెట్టి శంకర్రావుకు ఘన సన్మానం**

**ఐఎన్టీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):**తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక "శ్రమ శక్తి అవార్డు" అందుకున్న ప్రముఖ కార్మిక నాయకుడు జెట్టి శంకర్రావు ను ఐఎన్టీయూసీ కేంద్ర నాయకులు, బెల్లంపల్లి బ్రాంచ్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. బెల్లంపల్లి ఐఎన్టీయూసీ యూనియన్ బ్రాంచ్ కార్యాలయంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రకాష్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెట్టి శంకర్రావుకు పూలబొకే అందించి, జ్ఞాపికను ప్రదానం చేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తూ, కార్మికుల సంక్షేమం కోసం నాలుగు దశాబ్దాలుగా అహర్నిశలు కృషి చేస్తున్న జెట్టి శంకర్రావుకు "శ్రమ శక్తి అవార్డు" లభించడం సింగరేణి కార్మిక లోకానికి గర్వకారణమని పేర్కొన్నారు. కార్మికులకు నిస్వార్థ సేవలు అందిస్తున్న ఆయనకు ఈ అవార్డు రావడం పట్ల ఐఎన్టీయూసీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు . జెట్టి శంకర్రావు 1967 ఏప్రిల్ 14న బెల్లంపల్లిలో సింగరేణి ఉద్యోగి జెట్టి సీతారామస్వామి, విజయలక్ష్మి దంపతులకు జన్మించారు. బాల్య విద్యను బెల్లంపల్లిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో ప్రారంభించి, సీఎస్ఐ హైస్కూల్‌లో 1982లో పదవ తరగతి పూర్తి చేశారు. అనంతరం వరంగల్‌లో ఐటిఐ పూర్తి చేసి 1985లో సింగరేణి సంస్థలో ట్రేడ్స్‌మెన్‌గా ఎంపికై బెల్లంపల్లి మార్గన్ పిట్-44 గనిలో విధుల్లో చేరారు. తర్వాత శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి 3-3ఏ గనిలో సేవలు కొనసాగించారు. విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్‌యూఐలో చురుకుగా పాల్గొన్న ఆయన, 1985లో డాక్టర్ జి. సంజీవరెడ్డి సారథ్యంలో ఐఎన్టీయూసీ యూనియన్‌లో చేరి పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. గని ఫిట్ సెక్రటరీగా ప్రారంభమైన ఆయన ప్రయాణం బ్రాంచ్ కార్యదర్శి, వైస్ ప్రెసిడెంట్, కేంద్ర కార్యదర్శి, కేంద్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ స్థాయిలకు ఎదిగింది. ప్రస్తుతం




జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా, కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. యువతను ప్రోత్సహించడంలో కూడా ఆయన విశేష పాత్ర పోషించారు. నస్పూర్‌లో ఐఎన్టీయూసీ కార్యాలయ నిర్మాణంతో పాటు యువత కోసం వ్యాయామశాల ఏర్పాటు చేశారు. 1995లో నస్పూర్ ఎంపీటీసీగా ఎన్నికై ప్రజాసేవలోనూ తనదైన ముద్ర వేశారు. సింగరేణి సంస్థలో ట్రేడ్స్‌మెన్ అప్రెంటిస్‌లకు శిక్షణ అందించి నైపుణ్యమైన టెక్నీషియన్లుగా తీర్చిదిద్దడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయం అన్నారు .దేశవ్యాప్తంగా జరిగిన యూనియన్ సమావేశాలు, కాంగ్రెస్ పార్టీ ప్లీనరీల్లో పాల్గొంటూ కార్మిక చట్టాలు, సంక్షేమం, వేతనాలు, ఆర్థిక అంశాలపై లోతైన అవగాహనతో గత 40 ఏళ్లుగా కార్మికులకు సేవలు అందిస్తున్నారని నాయకులు కొనియాడారు. ఆయన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ సిఫారసుతో ఈ ప్రతిష్టాత్మక "శ్రమ శక్తి అవార్డు"ను ప్రదానం చేసిందన్నారు . ఈ సందర్భంగా జెట్టి శంకర్రావు మాట్లాడుతూ, తన ఎదుగుదలకు సహకరించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్, బెల్లంపల్లి ఏరియా కేంద్ర, బ్రాంచ్ నాయకులు, కార్యక్రమంలో పాల్గొన్న ఐఎన్టీయూసీ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఏరియా కార్యదర్శులు బూర శ్రీనివాస్, మాధవ కృష్ణ, అంబేద్కర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సోగాల వామన్ కుమార్, అబ్బాస్ తదితర బ్రాంచ్ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జూన్ 2న మంచిర్యాల జిల్లా శ్రీరాం పూర్ ఏరియా పరిధిలో ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. జూన్ 2 న ఉదయం 8 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం షిర్కె, సిసిసి, శ్రీరాంపూర్ ప్రాంతాల ద్వారా జీఎం కార్యాలయం వరకు బతుకమ్మలు, ఒగ్గుడోలు, పోతరాజులు, తెలంగాణ ధూం ధాం కళారూపాలతో టీరన్ మరియు భారీ ర్యాలీ నిర్వహించనున్నారని తెలిపారు. అనంతరం జీఎం కార్యాలయం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. తర్వాత జీఎం కార్యాలయ ప్రాంగణంలో జీఎం మునిగంటి శ్రీనివాస్ చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరగనుందని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి స్టేడియంలో విద్యార్థినీ, విద్యార్థులు, సేవా సభ్యులు, సింగరేణి కళాకారులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే ఉత్తమ ఉద్యోగులను జీఎం చేతుల మీదుగా సత్కరించనున్నారు. అదే ప్రాంగణంలో సింగరేణి సంస్థకు చెందిన రెస్క్యూ, మెడికల్, ఫారెస్ట్, మైన్స్, సేవా సమితి, కమ్యూనికేషన్ తదితర విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు .ఇవే కాకుండా వివిధ రకాల తినుబండారాలు మరియు ఇతర స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించామని, తినుబండారాలు లేదా ఇతర స్టాల్స్ ఏర్పాటు చేయదలిచిన వారు జీఎం కార్యాలయం పర్సనల్ విభాగాన్ని సంప్రదించాలని అధికారులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**హౌసింగ్ ఏఈ సర్పంచ్ లతో కలిసి రావణ్ పల్లి లింబుగూడ, మెట్పల్లి గ్రామాల్లో సందర్శించి**

**గిరిజన లబ్ధిదారులను మోటివేషన్ చేసిన సిర్పూర్ (టి) ఎంపీడీఓ సత్యనారాయణ:**



**మే 27, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాజ్యోతి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్ (టి) మండల కేంద్రంలోని గిరిజన గ్రామ లను హౌసింగ్ ఏఈ, స్థానిక సర్పంచ్ తో కలిసి సందర్శించిన ఎంపీడీఓ సత్యనారాయణ,మండ ల కేంద్రంలోని రావన్పల్లి లింబుగూడ, మెట్పల్లి లో నిర్మాణ దశలో ఉన్న ఇండ్ల ను సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులతో కలిసి మాట్లా డుతూ.నిర్మాణ పనులను అతి త్వరలో పూర్తి చేయాలని మోటివేషన్ చేశారు.పని త్వరగా పూర్తి చేసినట్లయితే సకాలంలో మీ యొక్క ఖాతాలో నగ దు వస్తుందని సూచించా రు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పనుల్లో వేగవంతం చేయాలని త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపీ డీఓ సత్యనారాయణ అన్నారు.

# తాజా మెడికల్ బోర్డు ఫలితాలపై గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు నోరు విప్పాలి

### సిఐటియు జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి



మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):తాజా మెడికల్ బోర్డు ఫలితాలపై సింగరేణి లోని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నోరు విప్పాలని సిఐటియు జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు .మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పి-1 కార్మికులను ఫిట్ సెక్రటరీ తోడే సుధాకర్ అధ్యక్షతన బుధవారం కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి తాజా మెడికల్ బోర్డు ఫలితాలపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు నిర్వహణపై గొప్పలు చెప్పుకున్న సంఘాలు, ప్రస్తుతం ఆ ఫలితాలు ఏమయ్యాయో కార్మికులకు చెప్పాలని ఆయన ప్రశ్నించారు. అలాగే సింగరేణి వెబ్‌సైట్ నుండి మెడికల్ బోర్డు ఫలితాలను ఎందుకు తొలగించారో యాజమాన్యం, గుర్తింపు సంఘాలు సమాధానం చెప్పాలని కోరారు. ఒప్పందం ప్రకారం నిర్వహించాల్సిన కారుణ్య నియామకాల మెడికల్ బోర్డును నిర్వహించకుండా యాజమాన్యానికి కేవలం వినతిపత్రాలు ఇవ్వడమే జరుగుతోందని విమర్శించారు. మరోవైపు ప్రాతినిధ్య సంఘాలు తమ అనుబంధ ప్రజాప్రతినిధులను కలుసుకుని ఫోటోలు దిగడంలోనే కాలం గడుపుతున్నాయని, కానీ కార్మిక సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని ఆరోపించారు. సమ్మె నోటీసు ఇస్తామని చెబుతూ ప్రతిపక్ష సంఘాలు, కార్మికులను మభ్యపెట్టి మోసం చేసిన ఘనత యాజమాన్యం అనుకూల సంఘాలకే దక్కుతుందని ఆయన ఎద్దేవా చేశారు. కార్మికులు పని చేయడానికి అవసరమైన డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్లు, సిమెంట్ క్యాప్సూల్స్, కీలలు, బోల్టర్ రాడ్లు వంటి పనిముట్లతో పాటు గత కొన్ని నెలలుగా భద్రతా టోపీలు కూడా సరఫరా చేయడంలో యాజమాన్యం విఫలమైందని పేర్కొన్నారు. అయినప్పటికీ గెలిచిన సంఘాలు యాజమాన్యాన్ని ప్రశ్నించలేని స్థితిలో ఉన్నాయని విమర్శించారు. ఇప్పటికైనా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు తమ స్వప్రయోజనాలను పక్కనపెట్టి కార్మిక సమస్యల పరిష్కారానికి కట్టుబడి అన్ని కార్మిక సంఘాలతో కలిసి పోరాటానికి సిద్ధం కావాలని తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్, నాయ కులు నరేడ్ల వెంకటరెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ లక్ష్యంలో ప్రధాన పాత్ర పోషించిన మాతృమూర్తి మాతా రమాబాయి

బిఎస్పి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్

పార్టీ ఆధ్వర్యంలో మాతృమూర్తి రమాబాయి వర్ధంతి



మంచిర్యాల, 27 మే (ప్రజా జ్యోతి):మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ సమావేశ ప్రాంగణంలో మాతా రమాబాయి 91వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పి ) నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బహుజన్ సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాల దారిలో దీపంలా వెలుగుతూ తనకు తాను కరిగిపోతూ సమాజానికి మార్గదర్శకత్వం చూపించిన మహనీయురాలు మాతా రమాబాయి అని కొనియాడారు. అంబేద్కర్ లక్ష్య సాధనలో ఆమె చేసిన త్యాగాలు, ఎదుర్కొన్న కష్టాలు చిరస్మరణీయమన్నారు. తన కన్న బిడ్డలను కోల్పోయినప్పటికీ ధైర్యంగా నిలబడి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వం మాతా రమాబాయిదని అన్నారు. ఆమె 91వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. "మీ త్యాగాలను స్మరించుకుంటూ, మీరు చూపించిన ఉన్నతమైన బాటలో నడుస్తూ మీ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తాము" అని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షులు గాజుల శంకర్, ఉపాధ్యక్షులు ఎండీ మతిన్ ఖాన్, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోమాస బ్రహ్మానందం, మంచిర్యాల జిల్లా నాయకులు అయిల్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ ఏర్పాట్లు పరిశీలించిన కాంగ్రెస్ నేతలు

### ఈద్గా వద్ద సౌకర్యాలు కల్పించాలి: శ్యామ్ నాయక్



ఆసిఫాబాద్ మే 27 ప్రజా జ్యోతి జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద బక్రీద్ పండుగ ఏర్పాట్లను ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఈద్గా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రార్థనలకు వచ్చే ముస్లిం సోదరులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. షామియానాలు ఏర్పాటు చేయడంతో పాటు చల్లని త్రాగునీటి సౌకర్యం కల్పించాలని మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వినోద్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గాదవేణి మల్లేష్, ఉపాధ్యక్షుడు తారిక్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, నాయకులు సాయి, నిఖిల్, జాలింషా, అమాన్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్‌పై కేసు రాజకీయ కక్షే

ప్రజా సమస్యలపై ప్రశ్నించిన నాయకుడిని టార్గెట్ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

– ఆసంపల్లి సంపత్ కుమార్



చెన్నూరు మే 27 ప్రజా జ్యోతి చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై నమోదైన కేసును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఆసంపల్లి సంపత్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో బాల్క సుమన్ పై కేసు నమోదు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు.తెలంగాణ మలి దశ ఉద్యమంలో విద్యార్థి లోకాన్ని ఏకం చేసి, ఆంధ్ర వలసవాదాన్ని ఎదుర్కొనే పోరాటంలో ముందు వరుసలో నిలిచిన దళిత నాయకుడు బాల్క సుమన్ అని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పై నిరంతరం పోరాడే నాయకుడిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం అన్యాయంగా కేసులు బనాయిస్తోందన్నారు.సింగరేణి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తూ మాట్లాడిన మాటలను వక్రీకరించి కేసులు పెట్టడం అనైతికమని ఆసంపల్లి సంపత్ కుమార్ మండిపడ్డారు. ఇదే ప్రభుత్వంలో ఉన్న నాయకులు గతంలో మరింత తీవ్రమైన వ్యాఖ్యలు చేసినా వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.రైతులు వడ్లు, మక్కల కొనుగోళ్ల కోసం ఇబ్బందులు పడుతుంటే వాటిని పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా, ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.బాల్క సుమన్ కేసులకు భయపడే నాయకుడు కాదని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి వడ్ల కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తర్పాలిన్ లేకుండా ఇసుక రవాణా: ప్రయాణికుల అవస్థలు

కళ్లలో ఇసుక పడుతున్నా పట్టించుకోవడం లేదు: గ్రామస్తుల ఆవేదన


అధికారులు చర్యలు తీసుకోవాలి ప్రయాణికులు




ఆసిఫాబాద్ మే 27 ప్రజా జ్యోతి కొమురంభీం ఆసిఫాబాద్ చౌర పెల్లి నుంచి వాంకిడికి రోజుకు 30 నుంచి 50 ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా, ఖమన కోమటిగూడ గ్రామంలో ట్రాక్టర్లపై తర్పాలిన్ కప్పకుండా ఇసుక రవాణా చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ట్రాక్టర్లలో నింపిన ఇసుకపై ఎలాంటి కవర్ లేకపోవడంతో గాలికి ఇసుక ఎగిరి వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారులు, పాదచారుల కళ్లలో పడుతోంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రవాణా చేసే వారు నిబంధనలు పాటించడం లేదని, అధికారులు కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ట్రాక్టర్లపై తప్పనిసరిగా తర్పాలిన్ కప్పి ఇసుక రవాణా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు

# జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి

**వాంకిడి కాంగ్రెస్ కార్యాలయంలో వర్ధంతి వేడుకలు: మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరు**



**ఆసిఫాబాద్ మే 27 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం భారత తొలి ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు దాదా హాజరయ్యారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్నూలే నారాయణ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుర్నూలే నారాయణ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీతో కలిసి నెహ్రూ పోరాడారని, స్వతంత్ర భారత తొలి ప్రధానిగా ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షుడు జాబోరే గణేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ మండోకర్ దాదాజీ, మాజీ ఉప సర్పంచ్ సెల్వట్కార్ పేంటు, నాయకులు చునర్కర్ శివాజీ, ఉప్రే రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యార్థం ఎక్స్‌రే మిషన్ ప్రారంభం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, 27, మే (ప్రజాజ్యోతి):** జిల్లా ప్రజల సౌకర్యార్థం రెండవ ఎక్స్‌రే మిషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనితతో కలిసి ఆయన డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా రూ.23 లక్షల విలువైన రెండవ డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ మిషన్ ద్వారా క్షయవ్యాధిని త్వరితగతిన నిర్ధారించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని మారుమూల ప్రాంతాల్లో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించడంలో ఈ మిషన్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. సుధాకర్ నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, టి.బి. సమన్వయకర్త సురేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు పల్లెవెలుగు బస్సు పునఃప్రారంభానికి వినతి

## మంత్రి వివేక్ వెంకటస్వామికి యూత్ కాంగ్రెస్ నేత మొహమ్మద్ ఇలియాజుద్దీన్ వినతిపత్రం



**జైపూర్ మే 27 ప్రజా జ్యోతి** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన మంచిర్యాల--చెన్నూరు ఆర్డినరీ (పల్లెవెలుగు) బస్ సర్వీసును తిరిగి ప్రారంభించాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ చెన్నూర్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ ఇలియాజుద్దీన్ రాష్ట్ర మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు.చెన్నూరు అసెంబ్లీ పరిధిలోని గ్రామాల ప్రజలు విద్య ఉద్యోగం వైద్య అవసరాల కోసం ప్రతిరోజూ రవాణాపై ఆధారపడుతున్నారని బస్ సర్వీస్ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మంచిర్యాల నుండి నర్వ జైపూర్,పెగడపల్లి,గంగిపెల్లి,బెజ్జాల, షెట్టపల్లి, మద్దులపల్లి, నర్సింగాపూర్, కుందారం, ఎల్కంటి క్రాసింగ్, వేలాల, గోపాలపూర్,పౌనూర్,శివ్వారం గ్రామాల మీదుగా చెన్నూరు వరకు ఉదయం చెన్నూరు నుండి మంచిర్యాలకు, సాయంత్రం మంచిర్యాల నుండి చెన్నూరుకు పల్లెవెలుగు బస్సును నడపాలని కోరారు.గ్రామీణ ప్రాంత ప్రజలు విద్యార్థులు ఉద్యోగులు వృద్ధులు రోగులకు ఈ బస్సు సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వేలాది మందికి ఉపశమనం కలుగుతుందని తెలిపారు.వినతిపత్రం పై మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించి సంబంధిత డిపో మేనేజర్‌కు విషయం తెలియజేసినట్లు సమాచారం.ఈ సందర్భంగా మొహమ్మద్ ఇలియాజుద్దీన్ మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామీణ ప్రజలకు అవసరమైన రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే నమ్మకంతో వినతిపత్రం అందజేశాం.ప్రజలకు ఉపయోగపడే ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు కృషి చేస్తాం అని తెలిపారు.

# సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ విభాగం ఉద్యోగుల పనితీరు భేష్

## శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్






**మంచిర్యాల, 27,మే ( ప్రజా జ్యోతి ):** సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ విభాగం ఉద్యోగుల పనితీరు భేష్ అని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కొనియాడారు. బుధవారం ప్రత్యేకంగా పర్సనల్ విభాగం ఉద్యోగుల తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జి.ఎం మాట్లడుతూ, ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్, సీపీఆర్ఎంఎస్ కార్డుల మంజూరి, ట్రాన్సఫర్స్, ప్రమోషన్స్ క్వార్టర్స్ కేటాయింపు ఇలా అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలతోపాటు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల వివరాల నమోదు వంటి సేవల విషయంలో డీజీఎం పర్సనల్ ఎస్. అనిల్ కుమార్ పర్యవేక్షణలో శ్రీరాంపూర్ పర్సనల్ విభాగం ముందువరుసలో నిలుస్తోందన్నారు. ముఖ్యంగా ఉద్యోగుల గైర్హాజరు విషయంలో క్రమశిక్షణ చర్యలు, అప్పీళ్లను త్వరితగతిన పూర్తి చేస్తూ కంపెనీ వ్యాప్తంగా అన్నీ ఏరియాలకంటే ముందంజలో నిలుస్తూ ఏరియాకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని అభినందించారు. ఈ సందర్భంగా సంబంధిత విధులలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన సీనియర్ అసిస్టెంట్ ఆకుల అఖిల డీవై పీఎం జి.కె. కిరణ్ కుమార్ లను ప్రోత్సాహక బహుమతితో జీఎం శ్రీ మునిగంటి శ్రీనివాస్ గారు ప్రత్యేకంగా అభినందించారు.వీరిని ఆదర్శంగా తీసుకొని పర్సనల్ విభాగంలోని ఇతర అధికారులు, ఉద్యోగులు నిబద్ధతతో తమ తమ విధులు నిర్వహిస్తూ సంస్థలో శ్రీరాంపూర్ ఏరియాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతీ ఒక్కరు సమయపాలన పాటిస్తూ నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) ఎస్ . అనిల్ కుమార్, డీవై పీఎం కిరణ్, సీనియర్ పీఓలు మురళి, ప్రశాంత్, సురేందర్, పర్సనల్ విభాగం ఉద్యోగులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లాష్ న్యూస్. ఫ్లాష్ న్యూస్...

## కోల్ ఇండియా అపెక్స్ జేసీసీలో నాలుగు లేబర్ కోడ్లపై కీలక చర్చ

### కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) యాజమాన్యం జూన్ 5న అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం

**మంచిర్యాల, 27,మే (ప్రజాజ్యోతి):** కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) యాజమాన్యం జూన్ 5న అపెక్స్ జాయింట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశం కోల్‌కతాలోని సీఐఎల్ ప్రధాన కార్యాలయం లో ఉదయం 11.30 గంటలకు జరగనుంది. సీఐఎల్ కార్యనిర్వాహక సంచాలకుడు (హెచ్ఆర్) గౌతమ్ బెనర్జీ విడుదల చేసిన సమాచారం ప్రకారం, కేంద్ర ప్రభుత్వం అమలు చేయ నున్న నాలుగు లేబర్ కోడ్ల ప్రభావం కోల్ ఇండియాపై ఎలా ఉండబోతుందనే అంశంపై ఈ సమావేశంలో సమగ్ర చర్చ జరగనుంది. అలాగే లేబర్ కోడ్ల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై కూడా చర్చించ నున్నారు.కొత్త లేబర్ కోడ్లు అమల్లోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక సంబంధాల వ్యవస్థ, ట్రేడ్ యూనియన్ల గుర్తింపు, వేతన ఒప్పందాలు, కార్మికుల ప్రతినిధిత్వం, ఉద్యోగుల హక్కులు తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లపై నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం, సీఐఎల్ డైరెక్టర్ (హెచ్ఆర్) వినయ్ రంజన్ ఈ నెల 18న అన్ని అనుబంధ సంస్థలకు లేఖ రాసి లేబర్ కోడ్ల అమలుకు సిద్ధం కావాలని సూచించారు.అపెక్స్ జేసీసీ అనేది కోల్




ఇండియాలో అత్యున్నత స్థాయి సంయుక్త సలహా కమిటీ. సాధారణంగా ఈ సమావేశానికి సీఐఎల్ చైర్మన్ అధ్యక్షత వహిస్తారు. సమావేశంలో సీఐఎల్ డైరెక్టర్లు, అనుబంధ సంస్థల సీఎండీలు, బీఎంఎస్, హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ, సీటూ వంటి కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు, సీఎంఓఏఐ ప్రతినిధులు పాల్గొంటారు.ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో బొగ్గు పరిశ్రమలో కార్మిక సంబంధాల దిశను నిర్ణయించే అవకాశముండ టంతో కార్మిక సంఘాలు, ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

# వడదెబ్బతో మృతి చెందిన తలండి నారాయణ,తలండి చంద్రయ్య కుటుంబా లను ప్రభుత్వం ఆదుకోవాలి

## తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ డిమాండ్

**మే 27, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని పెంచికల్పేట్ మండలం కమ్మర్గాం గ్రామ పంచాయతీ పరిధిలోని గుండెపల్లి గ్రామానికి చెందిన తునికి ఆకు కూలి తలండి నారాయణ వడదెబ్బ తగిలి నిన్న మరణించడం జరిగింది. అదేవిధంగా ఆదివారం రోజున అదే పంచాయతీ లోని నందిగామ గ్రామనికి చెందిన తలండి చంద్రయ్య వడదెబ్బతో మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ ఆదివాసి గిరి జన సంఘం నాయకులు ఈరోజు గుండెపెల్లి లో నారాయణ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను కలిసిన వారికి ధైర్యంగా ఉండాలని సూచించారు. నారాయణ కుమారుడు శ్రీనివాస్, కూతురు చిట్టి మాట్లాడుతూ తన తండ్రి శుక్రవారం,శనివారం తునికి ఆకులు కోయడానికి వెళ్లారని ఆరోజు వేడికి తట్టుకోలేక అవస్థలు పడ్డారని అన్నారు. సోమవారం కూడా ఇబ్బంది పడుతూ ఉదయం ఆస్వస్థత కు గురవడంతో 108 అంబులెన్స్ లో బెజ్జూర్ ఆస్పత్రికి తరలించామని చికిత్స పొందుతూ 11 గంటల ప్రాంతంలో మృతి చెందారని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులకు తెలప డంతో ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు ఆదివాసీలు మృత్యువాత పడడం బాధాకరమని అన్నారు. ఇద్దరు కూడా వడదెబ్బతోనే మృతి చెందారని వీరిలో తలండి నారాయణ తునికాకు కూలి అని తునికాకు సేకరణ విధానాలకు లోబడి అతని కుటుంబా నికి రావలసిన నష్ట పరిహారాన్ని సదరు కాంట్రాక్టర్ చెల్లించాలని డిమాండ్ చేశారు.కనీసం కాంట్రాక్టర్ కుటుంబాన్ని పరామర్శించకపోవడం చాలా బాధాకరమని, అధికారులు సైతం



ఈ రెండు కుటుంబాలను కలిసి వివరాలు సేకరించా లని కోరారు.ఆ కుటుంబా లకు న్యాయం చేసే విధం గా స్థానిక తాసిల్దార్ చొర వ చూపాలని డిమాండ్ చేశారు.తలండి నారాయ ణ ను కుటుంబ సభ్యులు బెజ్జూర్ ప్రాథమిక ఆసుప త్రికి తీసుకువెళ్లారని ఆసు పత్రిలోనే చికిత్స పొందు తూ తలండి నారాయణ మృతి చెందాడని కానీ ఆసుపత్రి సిబ్బంది కనీసం మరణ ధ్రువీకరణ పత్రం కూడా చేసి ఇవ్వలేదని, ఇది ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి తలండి చంద్రయ్య,తలండి నారాయణ కుటుంబా లను చట్ట ప్రకారం ఆదు కోవాలని,ఆ కుటుంబాలకి 10 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని,కుటుంబం లో ఒకరికి ఉద్యోగం, 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కమ్మర్ గాం మాజీ సర్పంచ్ మడప శ్రీనివాస్, సులుగుపల్లి సర్పంచ్ సోయం చిన్నయ్య, స్థానిక ఉపసర్పంచ్ కుడిమేత తిరుపతి, మొర్లిగూడ సర్పంచ్ పోర్తేటి వెంకటేష్ టిఏజిఎస్ మండల అధ్యక్షులు మడే మల్లేష్, ఎలుముల వెంకన్న, సిడాం శంకర్, పెంధం ఆనంద్ కుమార్, తోడసం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి కౌతాలి పర్యటన: హెలిప్యాడ్ ఏర్పాట్ల పరిశీలన

### కాంగ్రెస్ నాయకుల క్షేత్రస్థాయి తనిఖీ: సీఎం పర్యటనకు సన్నాహాలు



**ఆసిఫాబాద్ మే 27 ప్రజా జ్యోతి** జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌతాలి గ్రామానికి రానున్న నేపథ్యంలో, కాంగ్రెస్ నాయకులు బుధవారం హెలిప్యాడ్ ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు.ఈ పరిశీలనలో మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, జనక్పూర్ కౌన్సిలర్ జాడి వినోద్, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, దీపక్ ముండేతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.సీఎం పర్యటనకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నాయకులు సూచించారు. హెలిప్యాడ్ స్థలం చుట్టూ బారికేడ్లు, భద్రతా ఏర్పాట్లతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు తెలిపారు.

# ఉపాధి పనులను పరిశీలించిన శ్యామ్ నాయక్

### చదువే జీవితానికి ఆధారం

### పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులకు పిలుపుబి

### జూన్ 1న రేవంత్ సభకు రావాలని పిలుపు



**ఆసిఫాబాద్ మే 27 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని ఎనోలి, బాంబరా గ్రామ పంచాయతీ పరిధిలోని కోసరా గ్రామాల్లో బుధవారం ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ పర్యటించి ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాంకిడి ఉప సర్పంచ్, మండల కాంగ్రెస్ నాయకుడు దీపక్ ముండే, బాంబరా సర్పంచ్ కృష్ణ, పార్టీ నాయకులతో కలిసి ఆయన కూలీలకు అందుతున్న తాగునీరు, నీడ సదుపాయాలపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు జాగ్రత్తలు వహించాలని సూచిస్తూ, వారికి మజ్జిక, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ, తల్లిదండ్రులంతా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, చదువే జీవితా నికి ఆధారమని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తూ ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూళ్లు, ఉదయం పూట అల్పాహారం వంటి పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు.వచ్చే నెల జూన్ 1వ తేదీన కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు నియోజకవర్గ ప్రజలు, కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో బాంబరా ఉప సర్పంచ్ సంతోష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎం.డీ. నిజాం, సుధాకర్, జైరామ్, నాందేవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 27 ,( ప్రజాజ్యోతి ).** జనగణనలో భాగమైన ఇండ్ల గణన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం దిలావర్ పూర్ మండలంలోని కాల్వ గ్రామంలో కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జనగణన సిబ్బందితో కలెక్టర్ మాట్లాడుతూ, హౌస్ లిస్టింగ్ ప్రక్రియ జనగణనలో అత్యంత కీలకమైన ఘట్టమని, దీనిని పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలు, ఇప్పటివరకు పూర్తయిన ఇండ్ల వివరాలను ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో అడిగి వాకబు చేశారు. ప్రజల నుంచి సేకరించే సమాచారం ఖచ్చితత్వంతో ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ స్థానికులతో మాట్లాడుతూ, జనగణన దేశ అభివృద్ధిలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం ఆధారంగానే ప్రభుత్వాలు ప్రజాప్రయోజనార్థం వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రూపొందిస్తాయని పేర్కొన్నారు. కాబట్టి ప్రజలంతా ఎన్యుమరేటర్లు అడిగిన వివరాలను ఖచ్చితంగా అందించి, జనగణన ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలన లో జనగణన సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పాయల్ శంకర్ వి శిఖండి రాజకీయాలు

అటో కాలు ఇటో కాలు వేసి రాజకీయలు చేస్తున్నాడు

చివరికి ఎటూ కాకుండా పోతాడు

సీసీఐ పాపం ముమ్మాటికి పాయల్ శంకర్ దే

భూ మాఫియా, మైనింగ్ మాఫియా తో దోపిడి

కాంగ్రెస్ పార్టీ సీయం మంత్రులతో సాన్నిహిత్యం దేనికి నిదర్శనం...?

అసలు నువు బీజేపీ ఎమ్మెల్యే వేనా ..?

ప్రెస్ మీట్ లో కంది శ్రీనివాస రెడ్డి ధ్వజం



**ఆదిలాబాద్ బ్యూరో, మే 27 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శిఖండి రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపు కుంటున్నాడని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆ యన తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆది లాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తదితర కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ ఎమ్మె ల్యేగా పాయల్ శంకర్ రెండు న్నరేళ్లు పూర్తి చేసుకున్నా ని యోజకవర్గ ప్రజలకొరిగిందేమీ లేదని విమర్శించారు. ఎప్పు డూ హైదరాబాద్ లో మంత్రుల పేషీల్లో తిరగడం, సీఎంను కలిసి ఫోటో దిగి సీఎం నావా డే, మంత్రులు నావాళ్లే అంటూ ఆయన శిఖండి రాజకీ యాలు చేస్తున్నాడని ఘాటు గా విమర్శించారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనా మా చేసి సిద్దంగా ఉండాలన్నారు. కాని మళ్ళీ గెలవడం ఆయన జీవితంలో సాధ్యం కాదన్నారు. కేవలం సొంత ప్రయో జనాలు, లబ్ది కోసం మాత్రమే ఆయన ప్రయత్నం తప్ప ప్రజా ప్రయోజాలకోసం మాత్రం కాదన్నారు. నిజంగా ఆదిలాబాద్ ప్రజల మీద ప్రేముంటే సీసీఐని తుక్కుకింద అమ్మనిచ్చేవారు కాదన్నారు. ఎన్నికల కంటే ముందు సీసీఐని తెరిపిస్తాన నివాగ్ధానమిచ్చిన బీజేపీ పెద్దలు ఎమ్మెల్యే మాట తప్పారని విమర్శించారు. సీసీఐ పాపం ముమ్మాటికీ పాయల్ శంకర్‌దే అన్నారు. ఇష్టం వచ్చిన ట్టు హామీలిచ్చి ప్రజలను వంచించారన్నారు. ఆయన వి కేవలం ఉత్తర కుమార ప్రగ ల్భాలు అని ఎద్దేవా చేశారు. సీసీఐ ని తుక్కుకింద అమ్ముతుంటే ఏం చేస్తున్నావని ప్ర శ్నించారు. పాయల్ శంకర్ ఒక ఛీటర్ అని ఘాటైన వ్యా ఖ్యలు చేశారు. పార్టీ ఆఫీస్ వి షయంలో సొంత పార్టీ నే మోసం చేసిన ఘనుడన్నారు. అంతే కాకుండా సొంత పార్టీ ఎంపీ ఎదుగుదలకు కూడా అడ్డు పడుతున్నాడని ఆరోపించారు. తన హెలీక్యాప్టర్ సోకుతో ఆదిలాబాద్ పర్యటనకు వచ్చి న మంత్రులను ఇబ్బందులు పెట్టేవారన్నారు.ఆయన ఒక రాజకీయ వ్యభిచారి అని విమర్శించారు. అంతే కాకుండా మైనింగ్ మాఫియా భూ కబ్జా, బెదిరింపులతో దాదాపు 485 కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారన్నారు.ఆయన అక్రమాల పై త్వరలోనే ఎంక్వైరీ జరుగుతుందన్నారు. కాగజ్ నగర్ లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను శ్రేణులు, ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జొన్న రైతులు కూడా నిరాశ చెందవద్దని చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేపడతుందని భరోసా నిచ్చారు. అటు బీజేపీ నేతల రాజకీయాలపై డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాద వ్ భగ్గుమన్నారు. మతం పేరు తో రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడు తున్నార న్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికలో బీజేపీ శ్రే ణులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని మండి పడ్డారు. మరోవైపు గందరగోళ పరిస్థితుల కారణంగాలా అండ్ ఆర్డర్ ఇష్యూ వస్తుంద న్న అనుమానంతో కోఆప్షన్ ఎన్నికను వాయిదా వేస్తున్న ట్టు తాను ప్రకటించినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆత్మ చైర్మన్ గిమ్మ సం తోష్ రావు, కాంగ్రెస్ పట్టణా ధ్యక్షుడు ఖిజర్ పాషా, డీసీసీ బీ డైరక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి , కౌన్సిలర్లు చరణ్ గౌడ్, జీషాన్, అన్నపూర్ణ, స్వాతి, నర్మద, మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ కావేటి జ్యోతి, రషీద్, మంచాల మల్లయ్య, బూర్ల శంకరయ్య రాంకుమార్ రాజ్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్

**శాలువాతో సత్కరించిన కామ్డే అనిల్ కుమార్**



**ఆసిఫాబాద్ మే 27 ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీ సీవీ ఆనంద్ ను కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్డే అనిల్ కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో, సీవీ ఆనంద్ కు కామ్డే అనిల్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి, యువతకు ఉపయోగపడేలా పోటీ పరీక్షల మెటీరియల్స్ అందుబాటులో ఉంచడం వంటి పలు అంశాలపై వారి మధ్య సానుకూలంగా చర్చ జరిగినట్లు సమాచారం. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు గ్రంథాలయాల ద్వారా మరిన్ని సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు.

## ఉట్నూర్ ఆర్డీవో గా మోహన్ సింగ్ బాధ్యతల స్వీకరణ



**ఆదిలాబాద్ బ్యూరో, మే 27, (ప్రజా జ్యోతి )** ఉట్నూర్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా మోహన్ సింగ్‌ని యమితులయ్యారు. ఈ మేర కు ఆయన ఉట్నూర్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపద్యంలో బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రెవెన్యూ శాఖ కార్యకలాపాలను పార దర్శకంగా నిర్వహించాలని సూచించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను మర్యాదపూర్వకంగా కలిసిన

**ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్**



**ఖానాపూర్ మే 27( ప్రజా జ్యోతి )** ఇటీవల కాంగ్రెస్ పార్టీ వివిధ మండలాల్లో అధ్యక్షులను పట్టణ అధ్యక్షులను ఎంపిక చేయడం జరిగింది ఈ మేరకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ అధ్యక్షులుగా గొర్రె గంగాధర్ నియమింపబడ్డారు ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులువెడ్మ బొజ్జు పటేల్ను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అందరితో కలిసి పోవాలని గొర్రె గంగాధర్ ను ఆదేశిస్తూ ఎమ్మెల్యే శాలువతో సత్కరించారు

## పంట భూమికి నిప్పు ఈ సమాజానికి పెను ముప్పు

వ్యవసాయ అధికారి నాగరాజు



**లక్ష్మణ చాంద, మే 27 (ప్రజా జ్యోతి)** వరి కొయ్యలను కాల్చవద్దని అలాగే పంట భూమికి నిప్పు పెడితే ఈ సమాజానికి పెను ముప్పు అని వ్యవసాయ అధికారి ఏవో నాగరాజు అన్నారు. మంగళవారం రోజున కనకాపూర్ గ్రామ రైతులతో వారి పంట భూములలో అవగాహన సదస్సును నిర్వహించారు. వరి, మొక్క జొన్న కొయ్యలను కాల్చవద్దని వాటిలో 16 రకాల పోషకాలు ఉంటాయని రైతులకు విజ్ఞప్తి చేశారు. వరి, మొక్కజొన్న కొయ్యలను కాల్చివేత వల్ల భూసారం నష్టం కావడంతో పాటు వాయు కాలుష్యం పెరుగుతుందని అలాగే మనుషులకు, మూగజీ వాలకు ప్రాణ నష్టం, కలిగి పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటరాజు, అగ్నిమాపక సిబ్బంది డివిజన్ ఆఫీసర్ శివాజీ, పోలీస్ శాఖ అధికారులు, ఏ ఈవో మౌనిక, రైతులు పాల్గొన్నారు. పంట భూములలో వరి, మొక్కజొన్న కొయ్యలను కాలుస్తే దానితో కలిగే నష్టాల గురించి రైతులకు ఈ అవగాహన కార్యక్రమాన్ని బిగ్‌టీవీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ శ్రేణులు 5వేల ఆర్థిక సాయం



**ఖానాపూర్ మే 27( ప్రజా జ్యోతి)**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి ఈదురు గాలుల బీభత్సానికి ఖానాపూర్ పట్టణంలోని 4వార్డ్ శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన బోగు నర్సయ్య ,బోగు రవి ఇంటి పై కప్పు పూర్తిగా లేచిపోగా బాధిత కుటుంబాన్ని స్థానిక కౌన్సిలర్ల తో కలిసి పరామర్శించారు తక్షణ సహాయం కింద 5వెల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే సహ కారంతో రెండవ విడతలో ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి చేస్తామ ని అన్నారు బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం నుంచి అన్ని విధాలు గా ఆదుకుంటామని కాంగ్రెస్శ్రేణులు అన్నారు ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ పదకొండవ వార్డు కౌన్సిలర్ రాజు రా సత్యంతో పాటు కౌన్సిలర్ నిమ్మల రమేష్ ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం ,పట్టణ అధ్యక్షులు గౌర్రె గంగాధర్, జమాల్ ఖురేషీ,4 వార్డ్ ఇంచార్జీ కస్తూరి మహేష్, జన్నారపు శంకర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆదిలాబాద్ లో ఘనంగా నెహ్రూ వర్ధంతి

నివాళులు అర్పించిన డిసిసి అధ్యక్షుడు నరేష్ జాదవ్ కాంగ్రెస్ శ్రేణులు



**ఆదిలాబాద్ బ్యూరో, మే 27 (ప్రజా జ్యోతి)** స్వాతంత్రం వచ్చిన తర్వాత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దేశాన్ని పురోగతి వైపు నడిపించిన గొప్ప నాయకుడు దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని డీసీసీ కార్యాలయం లో నెహ్రూ వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణుల తో కలిసి ఘణంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన దూరదృష్టితో రూపొందించిన అనేక ప్రణాళికలు, ఆయన పాటించిన ప్రజాస్వామ్య విలువలు, శాంతి, విజ్ఞాన- సాంకేతిక రంగాల అభివృద్ధికి చేసి న సేవలు చిరస్మరణీ యమని కొనియాడారు. భవిష్యత్ త రాలకు ఆయన జీవితం ఆశ యాలు ఎల్లప్పుడూ స్ఫూర్తి దాయకమని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయ కులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగం పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

-నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి రూ.20 వేల వసూళ్లు

-ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారిపై అప్రమత్తంగా ఉండాలి

-బోథ్ సిఐ డి గురుస్వామి




**బోథ్, మే 27 (ప్రజా జ్యోతి)** బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన అల్లాడి రాకేష్ అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా బోథ్ సీఐ డి గురు స్వామి బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ వివరాల ప్రకారం నిర్మల్ జిల్లాకు చెందిన నిందితుడు పాలంకర్ గంగాధర్ స్కూల్లో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చి ఫోన్‌పే ద్వారా రూ.20 వేలు వసూలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగం ఇవ్వకుండా ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి మోసం చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా బాధితులు ఉంటే నిర్భయంగా జిల్లా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు. ఉద్యోగాలు ఊరికే రావని ప్రభుత్వ ఉద్యోగాలు నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయబడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వి. పురుషోత్తం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి

### రైతులు అధైర్యపడవద్దు తడిచిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం

### రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి






**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 27 ,( ప్రజాజ్యోతి ).**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తడిచిన ధాన్యం విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, తడిచిన వరి ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాల వారిగా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆయన సమీక్షించారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హమాలీల, రవాణా సమస్య లేకుండా చూడాలన్నారు. కలెక్టర్లు వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీసీ అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. రోజువారీగా నిర్దేశిత కొనుగోలు లక్ష్యాలు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఆర్డీఓ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**మిల్లుల వద్ద అన్‌లోడింగ్‌లో ఆలస్యం వద్దు**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 27 ,( ప్రజాజ్యోతి ).** జిల్లాలో మిగిలి ఉన్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సోన్ మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, ఐకేపీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.కేంద్రానికి వచ్చిన ధాన్యం పరిమాణం, ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, తేమ శాతానికి వచ్చి ఇంకా తూకం వేయాల్సిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు.“నిర్ణీత తేమ శాతానికి రాగానే ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని, లారీల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తూకం వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వఉండకూడదని కలెక్టర్స్పష్టం చేశారు.అంతకుముందు కలెక్టర్ జాఫ్రాపూర్ గ్రామంలోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వస్తున్న ధాన్యం లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల వద్ద వేచి ఉన్న లారీల వివరాలు, అన్‌లోడింగ్ వేగంపై అధికారుల ను ఆరా తీశారు.రానున్న రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం అన్‌లోడింగ్‌లో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని సూచించారు. అవసరమైతే హమాలీల సంఖ్యను పెంచి ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. పౌరసరఫరాలు, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.అనంతరం మామడ మండలం కొరిటికల్ గ్రామంలోని రైస్ మిల్లులు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియలను వెంటవెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్లు సంతోష్, శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈదురు గాలులు వర్షాల్లో నష్టపోయిన కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగల్ శంకర్, పలువురు నాయకులు





**ఖానాపూర్ మే 27( ప్రజా జ్యోతి)** మంగళవారం సాయంత్రం నుండి రాత్రి వరకు కురిసిన అకాల ఈదురు గాలుల వర్షాల కు ఖానాపూర్ మండలం లో నష్టపోయిన పలువురు బాధితులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగిల్ శంకర్ ఇతర కాంగ్రెస్ శ్రేణులు ఖానా పూర్ శాసనసభ్యులు వె డ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మండలంలో పలు గ్రామాలు తిరిగి పరిస్థితులను పరిశీలించి బాధితుల సమస్యలు తెలుసుకు న్నారు ఖానాపూర్ మండలంలోని కొత్తపేట్ గ్రామానికి చెందిన సుంకె అనిల్, గోడల పంపు గ్రామానికి చెందిన మద్దెనపెల్లి రజనికాంత్, మద్దెల రాజవ్వ, దిలావర్పూర్ గ్రామానికి చెందిన ఆతిల్ బేగ్ ఆర్గతి లింగన్న, ఇంటి పైకప్పులు పూర్తిగా లేచిపోగా మరికొందరి ఇండ్ల ప్రహరీ గోడలు దెబ్బతిని నష్టపోయారు అలాగే మరికొందరి గుడిసెలు సైతం నేలమట్టమయ్యాయి దీంతో బాధిత కుటుంబాలకు జరిగిన నష్టాన్ని బాధిత కుటుంబా ల వివరాలు సేకరించాలీ అని తెలపడంతో బుధవారం ఎమ్మెల్యే ఆదేశానుసారం బాధితులను పరామర్శించడం జరిగిందని అన్నారు బాధితులకు జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే అన్ని విధాలుగా ఆదుకుంటారని అదేవిధంగా ఇంటి పైకప్పులు లేచిపోయిన బాధిత కుటుంబాలకు రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ తోటసత్యం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షు లు రాజు నాయక్ సర్పంచుల ఫోరం కార్యదర్శి పోలంపల్లి సచిన్ కొత్తపేట సర్పంచ్ సిద్ది నరేష్ పాత ఎల్లాపూర్ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నరసయ్య గోడల పంపు ఉపసర్పంచ్ కట్ల మల్లేష్ తర్లపాడు ఉపసర్పంచ్ సార్ల నరసయ్య ఏఎంసి డైరెక్టర్ గంగాధర్ పిఏసి ఎస్ డైరెక్టర్ గాజుల గంగన్న కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రాజేందర్ జాల రాజలింగు లక్ష్మీపతి గౌడ్ సుదర్శన్ లక్ష్మీరాజం రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

# ఉట్నూర్ మండల ప్రాంతంలో జైత్రం నాయక్ తండా గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**47 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు స్వాధీనం**

**60 లీటర్ల గుడుంబా, 4 దేశిదారూ, 64 లిక్కర్ బాటిల్‌లు స్వాధీనం**

**అసాంఘిక కార్యకలాపాలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవు**

**ప్రజల సంరక్షణ, భద్ర తకైక మ్యూనిటీ కాంటాక్ట్ ల నిర్వాహణ**

**50 మంది సిబ్బందితో ఉదయం 6 గంటల నుండి 10 వర కు తనిఖీలు**

**ఉట్నూర్ ఏఎస్ పి సాయి రూత్విక్**




**ఆదిలాబాద్ బ్యూరో, మే 27, (ప్రజా జ్యోతి)** ప్రజల రక్షణ, సంరక్షణ సక్ర మంగా నిర్వహించడానికి క మ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ అండ్ సెర్చ్) లను నిర్వహించ డం జరుగుతుందని ఉట్నూర్ ఏఎస్పీ సాయి రూత్విక్ ఐపీ ఎస్ తెలిపారు. ఉట్నూర్ మం డలంలో జైత్రం నాయక్ తం డా గ్రామంలో ఉదయం 6 గం టల నుండి 10 గంటల వరకు 50 మంది సిబ్బందితో కమ్యూ నిటీ కాంటాక్ట్ ను నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువ పత్రాలు లేనటువంటి 47 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా తనిఖీలలో 60 లీటర్ల గుడుంబా, 4 దేశీదారు, 64 లిక్కర్ బాటిల్లను స్వాధీ నం చేసుకోవడం జరిగిందని, అన్నారు. ఈ సందర్భంగా ఉ ట్నూర్ ఏఎస్పీ ప్రజలతో మా ట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి అసాం ఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, దొంగతనాలు, దోపిడీలు చేయకుండా సత్ప్ర వర్తనతో ఉండాలని అన్నారు. దొంగతనాలు చేసేవారి, నేరా లు చేసే వారి సమాచారం పో లీసులకు అందజేయాలని, కాలనీకి మంచి పేరు తీసుకువ చ్చేలా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటి నుండి చదువుపై ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలని, దొంగతనాలు అసాంఘిక కార్యకలాపాలు చేయకుండా పర్యవేక్షించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండాలని, ముఖ్యంగా ట్రాక్టర్ డ్రై వర్లు రోడ్డుపై వాహనాలు నడి పే సమయంలో ట్రాఫిక్ నియ మ నిబంధనలు పాటిస్తూ, రో డ్డు ప్రమాదాలను నివారించేం దుకు సక్రమంగా వాహనాల ను నడుపుతూ ఉండాలని తెలిపారు. వాహనాలను విత్ అవుట్ నంబర్ ప్లేట్ నడపడం, లైసెన్సు లేకుండా నడపడం చట్ట రీత్యా నేరంగా పరిగణించ బడుతుందని, అలాంటి చేయకుండా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉట్నూర్ సీఐ మాడవి ప్రసాద్, నార్నూర్ సీఐ అంజమ్మ, ఉట్నూర్ ఎస్ఐ విజయ్, ఇంద్ర వెల్లి ఎస్ఐ సాయన్న, నేరడి గొండ ఎస్ఐ శ్రీకాంత్, నార్నూర్ ఎస్ఐ శ్రీసాయి, ఏఎస్పైల క్ష్మణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ ఫ్రాడ్ కేసులో నిందితుడు అరెస్ట్ రిమాండ్

**వెటర్నరీ శాఖలో ఉద్యోగం ఇ ప్పిస్తానంటూ మూడు లక్షలు వసూలు చేసిన మోసగాడు**

**బాధితురాలి ఫిర్యాదుతో టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు న మోదు**

**ఉద్యోగం ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**ఉద్యోగాల పేరుతో మోసం చే సే వారిపై జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేయాలి**

**ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్ట ర్ కె నాగరాజు**




**ఆదిలాబాద్ బ్యూరో, మే 27, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంలోని కు ర్షిద్ నగర్ కి చెందిన ఒక ఫరా మాలిక్ అనే మహిళ తన బం ధువైన నిందితుడు ఎంఏ అక్బర్, తనకు మూడు లక్షలు ఇచ్చిన ఎడల వెటర్నరీ ఆసు పత్రిలో ఉద్యోగం కల్పిస్తానని చెప్పడంతో నమ్మిన మహిళ సంవత్సర కాలం క్రితం మూ డు లక్షలు ఇచ్చింది. అయితే గత సంవత్సరం తనకు వెట ర్నరీ ఆసుపత్రి లో ప్రాజెక్ట్ టె క్నీషియన్ గా ఉద్యోగం వచ్చిం దని నకిలీ పత్రాలను చూపిం చి మోసం చేశాడు. ఈ మో సాన్ని గ్రహించిన బాధితురా లు తన డబ్బులు తిరిగి ఇవ్వాలని లేదా ఉద్యోగాన్ని క ల్పించాలని తెలపడంతో, బాధితురాలు ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో సోమ వారం ఫిర్యాదు చేశారు. దీం తో మంగళవారం ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరా జు ఆధ్వర్యంలోని బృందం నిందితున్ని పట్టుకొని కోర్టులో హాజరు పరచగా రిమాండ్కు తరలించడం జరిగిందని తెలిపారు. ఉద్యోగాలు ఊరికే రావని ఉద్యోగాల పేరుతో మోసంచే సేవారి పట్ల అప్రమత్తంగా ఉం డాలని ప్రజలకు సూచించారు. ప్రజలు ఇలాంటి మోసగాళ్లు మోసం చేసే ప్రయత్నం చే సిన ఎడల వెంట నే జిల్లా పోలీస్ యంతరంగాన్ని సంప్రదించాలని సూచించారు.

## గోసరక్షణం చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

**విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రాలు**




**ఖానాపూర్ మే 27( ప్రజా జ్యోతి )**గో సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలంటూ ఖానాపూర్ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మండల తాసిల్దార్ మున్సిపల్ కమిషనర్ పోలీస్ శాఖలకు బుధవారం వినతి పత్రం సమర్పించారు అక్రమ గో రవాణా ని అడ్డుకొని గోవధ చేసేవారిని కఠినంగా శిక్షించాలని మున్సిపల్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నటువంటి గో వాద, పశువాద కేంద్రలను తొలగించి హిందువుల మనోభావాలని కాపాడాలని కోరారు ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు పిచరా రాంచందర్ బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ కాశవేణి ప్రణయ్ కుమార్ జిల్లా సహ సంయోజక్ ఆసం ఉదయ్ తంగళ పెల్లి రాజశేఖర్ ప్రఖండ గోరక్షక్ తాళ్ల భూమేష్ పట్టణ విద్యార్థి ప్రముఖ్ ఎడ్ల సాయిప్రణీత్ హర్షిత్ సాయికుమార్ బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 6 వ రోజుకు చేరిన వివో ఎలసమ్మె



**దిలావర్పూర్ , మే 27,( ప్రజాజ్యోతి ).**ఐకెపి వివో ఎ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దిలావర్ పూర్ మండల పరిషత్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక సమ్మె 6 వ రోజుకు చేరింది. సమ్మె చేస్తున్న వివో ఎ ల వద్దకు వెళ్లి బి ఆర్ ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం వివో ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ఆరు రోజులుగా సమ్మె చేపడు తున్న వివో ఎలకు ప్రభుత్వం స్పందించి కనీస వేతనం పెంచాలని కోరారు. ఇందులో నాయకులు అశోక్ శ్రీనివాస్ సత్యం వివోఏలున్నారు.

## సోనాలలో మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**సోనాల, మే 27 ( ప్రజాజ్యోతి )** :సోనాల మండల కేంద్రనికి చెందిన సింగం రమణ మాతృ మూర్తి లక్ష్మి కొన్ని రోజుల క్రితం అనారోగ్య కరణాల వలన పరమ పదించారు. ఈ రోజు అ విషయం తెలుసుకొని వారి స్వగృహనికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు. వీరితో రామయి సదానందం, సచిన్, ముస్తఫా, సలీమ్, వెంకటి, రామయ్య, సాయి రెడ్డి, ఎరెకరే వినీత్ మరియు గ్రామస్తులు తదితరులు ఈ పరామర్శ లో పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలలో ప్రవే శా నికి దరఖాస్తుల గడువు జూన్ 3 వరకు పొడగింపు

**ఆదిలాబాద్ బ్యూరో, మే 27 (ప్రజా జ్యోతి)** కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశా నికై దరఖాస్తు చేసుకునేందుకు గడువును జూన్ 3 వరకు పొడిగించినట్లు ఐటిడిఎ ప్రాజె క్టు అధికారి మంద మకరందు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్య పాఠశాలలో చదివి పదవ తరగతిలో ఉత్తీ ర్ణులైన గిరిజన బాలబాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తులు పూర్తిచే సి ఐటిడిఏ భవనంలోని డి ప్యూటీ డిఈఓ కార్యాలయం లో అందజేయాలని కోరారు. అదేవిధంగా ప్రవేశ పరీక్ష జూ న్ 5న ఉదయం 10:30 గం టలకు ఉట్నూర్ కేబి కాంప్లెక్స్ లోని బిఈడి కళాశాలలో ని ర్వహిస్తారని వివరించారు. ఇ దివరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ మార్పును గ మనించాలని సూచించారు.

## ఉద్యోగాల పేరుతో రూ.17.5 0 లక్షలు వసూలు చేసిన వ్యక్తి పై కేసు నమోదు

**కోర్టులో ఉద్యోగాల ఇప్పిస్తా నంటూ మాయ మాటలు**

**బాధితుల ఫిర్యాదుతో దర్యా ప్తు ప్రారంభం**

**ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ కె. నరేష్ కుమార్**



**ఇచ్చోడ, మే 27, (ప్రజా జ్యోతి)** ఇచ్చోడ మండలంలోని కామ గిరి గ్రామానికి చెందిన నక్కల రమ ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉద్యోగాల పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ కె. నరేష్ కుమార్ తెలిపారు. ఫి ర్యాదు ప్రకారం, నిందితుడు జీడిమెట్లకు చెందిన ఉప్పది శంకర్ అనే వ్యక్తి కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి ఫిర్యాదు దారు కుటుంబ సభ్యుల నుంచి దశల వారీగా రూ.18,50, 000/- తీసుకున్నాడు. అనంతరం ఉద్యోగా లు ఇప్పించలేనని చెబుతూ డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి కేవలం రూ.1 లక్ష మాత్ర మే తిరిగి ఇచ్చి మిగతా రూ. 17.50 లక్షలు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు పేర్కొ న్నారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ హె చ్ ఓ తెలిపారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి మోసాల కు గురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. నిందితునిచే బాధిం పబడిన ఇతర బాధితులు ఎవరైనా ఉన్నట్ల యితే నిర్భయంగా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించ వచ్చని తెలిపారు.

## వ్యక్తిని బెదిరించి డబ్బులు వ సూలు చేసిన ఇద్దరిపై కేసు న మోదు

**పరువు తీస్తామని బెదిరిస్తూ పంచాయతీ పేరుతో డబ్బులు డిమాండ్**

**భయభ్రాంతులకు గురిచేసి రూ.50 వేల రూపాయలు వసూలు**

**ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ సీఐ కె నరేష్ కుమార్**




**ఇచ్చోడ, మే 27, (ప్రజా జ్యోతి)** ఇచ్చోడ మండలంలోని సిరిచె ల్మ గ్రామానికి చెందిన రాజారపు సందీప్ అనే వ్యక్తి ఇచ్చోడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ ఎస్హెచ్ఓ కె నరేష్ కుమార్ తెలిపారు.ఫిర్యాదు ప్రకారం, బాధితుడికి ఒక మహిళతో అ క్రమ సంబంధం ఉండగా ఆవిషయం ఆమె భర్తకు తెలిసింది. అనంతరం గ్రామానికి చెందిన అబ్దుల్ అజీమ్, కాలా రవీందర్ కలిసి పంచాయతీ నిర్వహించి, గ్రామంలో విషయం బయట పడితే పరువు పోతుందని, సమస్యను పరిష్కరించా లంటే రూ. 1,50,000/- ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించడంతో భయాందోళనలకు గురైన బాధితుడు తన సోదరుడు ద్వారా రూ.50,000/- నగదును వారికి అందజేసినట్లు ఫిర్యా దులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తు న్నట్లు కె నరేష్ కుమార్ తెలిపారు. ఎవరైనా చట్టాన్ని చేతు ల్లోకి తీసుకొని బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మేడిగూడలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, మే 27 (ప్రజా జ్యోతి)** పంట కొనుగోళ్లతో పాటు గోదాంలకు తరలించే రవాణా ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం సాత్నాల మండలం మేడిగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి వస్తున్న పంట దిగుబడులు, ప్రస్తుత కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సేవలపై ఆయన అక్కడి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యార్డ్‌లో జరుగుతున్న వివిధ పనుల పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, కొనుగోలు కేంద్రాలనిర్వాహణపై అధికారులకు సూచనలు చేస్తూ, మార్కెట్ యార్డ్‌కు పంటను తీసుకువచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పంట కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, గిడ్డంగులకు తరలించేలా రవాణా చర్యలు వేగవంతం చేయాలని, రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.ఈ తనిఖీలో మండల ప్రత్యేక అధికారి రామ్ ప్రసాద్, తహసీల్దార్ జాదవ్ రామారావు, ఎంపిడిఓ వెంకటరాజు ,ఏవో రాథోడ్ కైలాష్, సర్పంచ్ లక్ష్మీ భాయి, స్థానిక మార్కెట్, రెవెన్యూ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలును వేగవంతం చేయాలి:

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 27 (ప్రజా జ్యోతి)** జిల్లాలో జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జొన్నల కొనుగోళ్లు, రవాణా ఏర్పాట్లపై ఆయన సంబంధిత అధికారులతో అత్యవసర గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. జొన్నల రవాణా, గిడ్డంగుల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు పక్కాగా పర్యవేక్షించాలని, కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చిత్రు, మార్క్ ఫెడ్ డీఎం మహేష్ కుమార్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్, రవాణా, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యాలయంలోనూ మహిళలకు రక్షణ కల్పించాలి







**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్ బ్యూరో, మే 27, (ప్రజా జ్యోతి)** మహిళా ఉద్యోగులు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాలలో భాగంగా బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో మహిళా సంక్షేమ శాఖ, ఉమెన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'పోక్సో యాక్ట్ పై ప్రత్యేక అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం చట్టప్రకారం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. 10 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది సిబ్బంది పనిచేసే ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో తప్పనిసరిగా 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒకవేళ ఏచిన్న కార్యాలయంలోనైనా ఈ కమిటీ అందుబాటులో లేకపోతే, జిల్లా స్థాయిలోని లోకల్ కంప్లైంట్ కమిటీ ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా విచారణలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే మెజారిటీ ప్రభుత్వ విభాగాలు కేంద్ర ప్రభుత్వ 'షీ-బాక్స్' పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నాయని, ఇంకా పెండింగ్‌లో ఉన్న శాఖలు ఏవైనా ఉంటే తక్షణమే ఆప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కమిటీల పనితీరును రాష్ట్ర, జాతీయ మహిళా కమిషన్లు నిరంతరం పర్యవేక్షిస్తుంటాయని వివరించారు. మహిళా ఉద్యోగులకు తమ హక్కులపై పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, దురదృష్టవశాత్తూ ఏవైనా వేధింపులు ఎదురైతే ఎక్కడ, ఎలా ఫిర్యాదు చేయాలో తెలియజేసేలా ప్రతి ఆరోగ్య కేంద్రం, ఎంపీడీవో, ఏంఆర్వో కార్యాలయం, అన్ని జిల్లా స్థాయి విభాగాల్లోని స్పష్టంగా కనిపించే ప్రదేశాలలో ఫ్లెక్సీలు లేదా కలర్ పోస్టర్లను ప్రదర్శించాలని ఆదేశించారు. దీనిపై తీసుకున్న చర్యల తాలూకు నివేదికను త్వరలోనే జిల్లా సంక్షేమ అధికారికి సమర్పించాలన్నారు. బాధితులు అధైర్యపడకుండా టోల్ ఫ్రీ నెంబర్ 181, షీ-బాక్స్ పోర్టల్ లేదా నేరుగా రాతపూర్వక ఫిర్యాదుల ద్వారా తమ సమస్యలను కమిటీల దృష్టికి తీసుకు రావచ్చుని, ఈ సదస్సు ద్వారా వివరించారు. అనంతరం మహిళా ఉద్యోగుల హక్కులు, రక్షణ మార్గదర్శకాలతో పోష్ యాక్ట్ ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, డిహెమ్హెచ్వో నరేందర్, డి వైఎస్ఓ శ్రీనివాస్, డిఎస్సీడివో సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, ఎల్సికమిటి చైర్‌పర్సన్ భవన సింగ్, జడ్పీ సీఈఓ రవి, కోఆర్డినేటర్ యశోద, వివిధ శాఖల అధికారులు, ఇంటర్నల్ కమిటి మెంబెర్స్, మహిళా ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అదిలాబాద్ మున్సిపాలిటీ ఆదర్శంగా తీర్చిదిద్దాలి





**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ బ్యూరో,మే 27 (ప్రజా జ్యోతి)** లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసి, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన మున్సిపల్ శాఖ ప్రగతిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పట్టణాల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని శానిటేషన్, ఇంజినీరింగ్ పనులు, ఆదాయ వనరుల సేకరణ, టౌన్ ప్లానింగ్, పార్కుల అభివృద్ధిపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్ర స్థాయిలో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని, నిరంతరం చెత్త సేకరణ, డ్రైనేజీ శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలతో మున్సిపల్ ఇంజినీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే గాంధీ పార్క్ డెవలప్మెంట్ పనులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఆదాయ వనరులను మెరుగుపరచడంపై సమీక్షిస్తూ, ఆస్తి పన్ను వసూళ్లలో 'ఎర్లీ బర్డ్ ఆఫర్'ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, నిర్దేశిత లక్ష్యాలను వంద శాతం సాధించాలని దిశానిర్దేశం చేశారు. వ్యాపార సంస్థల ట్రేడ్ లైసెన్స్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులను ఎలాంటి ఆలస్యం లేకుండా, నిబంధనల ప్రకారం పారదర్శకంగా జారీ చేయాలని స్పష్టం చేశారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేసి మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, సంబంధిత మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పిడి రాజు ఇంజినీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

